క్లుప్తంగా

ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్


రోడ్డు మార్జిన్ ఇలా...

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం చిలకపాడు–మద్దులూరు మధ్య మూల మలుపులో ఆర్అండ్బీ రోడ్డు మార్జిన్ ప్రమాదకరంగా మారిందని స్థానిక వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మార్జిన్లో ఇనగలేరులోకి వరద నీటి ప్రవాహం కారణంగా రోడ్డు మార్జిన్ కోతకు గురైంది. దానితో రోడ్డు మార్జిన్లో పైపులు బయట పడ్డాయి. వాహనదారులు పొరపాటున రోడ్డు మార్జిన్లోకి సైడు తీసుకునే సమయంలో ప్రమాదాలు జరుగుతాయోమోనని ఆందోళన చెందుతున్నారు. ఆర్అండ్బీ అధికారులు స్పందించి వెంటనే రోడ్డు మార్జిన్లో మరమ్మతులు చేయించి ప్రమాదాలు నివారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కర్నూల్ ఎంపీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు


ఎంపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న పద్మశాలి నాయకులు

చీమకుర్తి: కర్నూల్ ఎంపీ డాక్టర్ సింగరి సంజీవకుమార్ పుట్టిన రోజు సందర్భంగా చీమకుర్తి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పద్మశాలీయుల సంఘ నాయకులు కౌన్సిలర్ సోమా శేషాద్రి, చేనేత సొసైటీ అధ్యక్షుడు అవ్వారు ఆదినారాయణ, పద్మశాలీయుల సంఘం నాయకులు కె.వెంకట మోహన్రావు, కోటా రాములు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం చీమకుర్తి నుంచి కర్నూల్ వెళ్లి ఎంపీ నివాసంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


పరిశుద్ధరావుకు నగదు అందజేస్తున్న సర్పంచ్ రవికుమార్రెడ్డి

ఒంగోలు రూరల్: ఇటీవల కుటుంబ సభ్యురాలిని కోల్పోయిన పరిశుద్ధరావుకు వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు చేజర్ల సర్పంచ్ చాగంటి రవికుమార్రెడ్డి రూ.10 వేల నగదును తక్షణ సాయంగా అందజేశారు. మంగళవారం సాయంత్రం చేజర్ల సచివాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో పరిశుద్ధరావుకి ఆ మొత్తాన్ని ప్రస్తుతం అందజేసినట్లు సర్పంచ్ తెలిపారు. వైఎస్సార్ సీపీ, బాలినేని శ్రీనివాసరెడ్డి ఎప్పుడూ బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. కార్యదర్శి స్వాతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రమీజ్, వెల్ఫేర్ కృష్ణవేణి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవం


త్యాగరాజస్వామి చిత్రపటంతో ఉత్సవం

పామూరు: ప్రముఖ వాగ్గేయకారుడు త్యాగరాజస్వామి 175 ఆరాధన మహోత్సవం నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. త్యాగరాజస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి మేళతాళాలతో స్థానిక సత్యనారాయణస్వామి దేవస్థానం నుండి మదన వేణుగోపాలస్వామి దేవస్థానం వరకు ఉత్సవం నిర్వహించారు. మాట్లాడుతూ త్యాగరాజస్వామిని నేటి వాగ్గేయకారులు గురువుగా భావించి ఆయన మార్గాన్ని అనుసరించాలన్నారు. నాయీబ్రాహ్మణ సేవా సంఘ రాష్ట్ర కార్యదర్శి రాగిపాటి సుధాకర్, మండల అధ్యక్షుడు పశుపులేటి మస్తాన్, జిల్లా కమిటీ, మండల కమిటీ సభ్యులు, నాయీబ్రాహ్మణులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం

వెలిగండ్ల: మండలంలోని మొగళ్లూరుపల్లిలో వాగుపోరంబోకు భూమిని ఎంపీడీఓ టి.సుకుమార్ మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో సర్వే నంబర్ 266లో 1.75 ఎకరాలు, 267లో 1.32 ఎకరాలు ఉంది. ఆ భూమి విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం కొన్ని రోజుల నుంచి నడుస్తోంది. ఈ విషయంపై కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ సూచనలను పాటిస్తూ ఎంపీడీఓ టి.సుకుమార్, సర్వేయర్ బ్రహ్మానందరెడ్డి, పంచాయతీ కార్యదర్శి బి.కొండయ్యలు గ్రామం వెళ్లి సర్వే నం 266,267లోని భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా ఆ భూమిలోకి దిగితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహిళాశక్తికి నిదర్శనం సావిత్రీబాయి పూలే


వైఎస్సార్ సీపీ మహిళా కౌన్సిలర్లను సత్కరిస్తున్న జేఏసీ నాయకులు

ఒంగోలు: సావిత్రీబాయి పూలే మహిళా శక్తికి నిదర్శనమని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో జరిగిన సావిత్రీబాయి పూలే జయంతి కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలేజీ ఐక్యు ఏసీ కో ఆర్డినేటర్ కుసుమకుమారి మాట్లాడుతూ భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే అన్నారు. సావిత్రీబాయి పూలే, మహాత్మా జ్యోతిరావు పూలే జీవితాలు ధన్యమైనవంటూ వారి జీవిత గాథల గురించి సంక్షిప్తంగా వివరించారు. తెలుగు అధ్యాపకురాలు యామిని అమ్మాజీ పూలే గొప్పతనాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జరిగిన ఉపన్యాస పోటీల్లో విజేతలైన జి.రమ్య, లావణ్యలకు బహుమతులు అందించారు. డబ్ల్యూఈసీ కో ఆర్డినేటర్ ఇందిర, ఈసీ మెంబర్ సుష్మ పాల్గొన్నారు.

రెడ్క్రాస్ ఆధ్వర్యంలో..

స్థానిక పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి బి.విజయభాస్కర్ పాల్గొన్నారు. ముందుగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ మహిళా ఉపాధ్యాయినులు సావిత్రీబాయి జీవిత విశేషాలు తెలుసుకుని మహిళలు ఈ వృత్తిలోకి ప్రవేశించేందుకు ఆమె చేసిన త్యాగాలు వివరించారు. రెడ్క్రాస్ రాష్ట్ర కోశాధికారి డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, రెడ్ క్రాస్ ప్రతినిధి బెజవాడ పవన్, జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో..

మహాజన వర్గాల ఆశాజ్యోతి, చదువుల తల్లి సావిత్రీబాయి అని మహాజన సోషలిస్టు పార్టీ తోరటి ఆనంద్ మాదిగ పేర్కొన్నారు. మంగళవారం స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా సావిత్రీబాయి పూలే 192వ జయంతిని పురస్కరించుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజం మనకేమి ఇచ్చిందనే దానికంటే సమాజానికి మనం ఏమిచ్చాం అని ప్రతి వ్యక్తి భావిస్తే దేశం అభివృద్ధి పథకంలోకి దూసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో టి.పద్మ, చిన్నారి, సృజన పాల్గొన్నారు.

స్త్రీ విముక్తి కోసం సావిత్రీబాయి పూలే కృషి

● మహిళా కౌన్సిలర్లను సత్కరించిన జేఏసీ

చీమకుర్తి: స్త్రీ విముక్తి కోసం పోరాటం సాగించిన మొట్ట మొదటి మహిళ సావిత్రీబాయి పూలే.. అని అణగారిన కులాల ఐక్యవేదిక (జేఏసీ) నాయకులు షేక్ ఖాదర్బాషా, పేరం శ్రీనివాసరావు అన్నారు. సావిత్రీ బాయి పూలే జయంతి సందర్భంగా మంగళవారం చీమకుర్తిలోని జేఏసీ కార్యాలయంలో నివాళులర్పిస్తూ చీమకుర్తి మున్సిపాలిటీలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు, సర్పంచ్, ఎంపీటీసీ, కో ఆప్షన్ సభ్యురాళ్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే ఆశయాలను నేటి మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సంఘ సంస్కర్తగా, మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రీబాయి పూలే చేసిన సేవలను కొనియాడారు. అనంతరం చీమకుర్తి మున్సిపాలిటీలోని వైస్ చైర్పర్సన్ నలమలపు మాణిక్యం, మహిళా కౌన్సిలర్లు గోపురపు రాజ్యలక్ష్మి, పొదిలి వెంకాయమ్మ, మేకల సులోచన, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రజియా, బండ్లమూడి సర్పంచ్ దేవరపల్లి వెంకట లక్ష్మి, నాయుడుపాలెం ఎంపీటీసీ సభ్యురాలు కూడలి అంజలిని ఘనంగా సన్మానించారు. జేఏసీ నాయకులు దూపాటి సత్యం, చింతలపాలెం బాబూ, మర్రి లక్ష్మీనారాయణ, డి.పుల్లయ్య, ఇస్తర్ల శంకర్, గోపురపు చంద్ర, కూడలి మాలకొండయ్య, అత్యాల దావీదు స్థానికులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ పాలెంలో..

సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా చీమకుర్తిలోని 5వ వార్డు కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, మాజీ కౌన్సిలర్ శారద ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సావిత్రీబాయి పూలే మహిళల హక్కుల రక్షణకు చేసిన పోరాటం, మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా మహిళలను చైతన్యం చేసిన విధానాలు గుర్తు చేసుకున్నారు. పాటిబండ్ల రాజసులోచన, దానమ్మ, అరుంధతి, వీరమ్మ, కోటేశ్వరమ్మ, స్థానికులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న ఐక్యుఏసీ కోఆర్డినేటర్ కుసుమకుమారి


మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో..


పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో..

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ


కంప్యూటర్ అందిస్తున్న సూర్యనారాయణతో హెచ్ఎం

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడు కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పాఠశాల పూర్వ విద్యార్థి మండవ వెంకటేశ్వర్లు కంప్యూటర్ బహూకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ తెలిపిన సమాచారం మేరకు హైదరాబాద్ కాకతీయ నగర్కు చెందిన మండవ వెంకటేశ్వర్లు తాను చదివిన పాఠశాలకు ఏదో ఒక మేలు చేయాలన్న తలంపుతో పాఠశాలకు 51 వేల రూపాయల విలువైన కంప్యూటర్ను అందించడంతో పాటు తన ప్రతినిధి ఆరి సూర్యనారాయణ ద్వారా మధ్యాహ్న భోజనంలో మజ్జిగ సరఫరా చేసేందుకు 30 వేల రూపాయలు అందించారు. మజ్జిగ పంపిణీ ప్రతి సంవత్సరం చేసేందుకు ఆయన ముందుకు రావడంపై ప్రధానోపాధ్యాయుడు హర్షం వ్యక్తం చేసి ఆయన్ను అభినందించారు. విద్యార్థులకు సాయపడేందుకు వచ్చిన దాతను ప్రత్యేకంగా పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. వారి వెంట ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు పెద్దిరెడ్డి కోటిరెడ్డి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్డబ్ల్యూపీసీలపై ప్రత్యేకాధికారి సమీక్ష


కార్యదర్శులతో మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ రూన్సీరాణి

మద్దిపాడు: మండలంలోని ఎస్డబ్ల్యూపీసీపై మండల స్పెషలాఫీసర్ పి.రూన్సీరాణి మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో సమీక్షించారు. ఈ క్రమంలో ఆమె మాట్లాడుతూ మొత్తం మండలంలో ఎస్డబ్ల్యూపీ సెంటర్లు ఎన్ని ఉన్నాయి, ఎన్ని వినియోగంలో ఉన్నాయన్న విషయాలను ఆమె గ్రామ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ వినియోగంలో లేని పీసీలను ఏ విధంగా వినియోగంలోకి తీసుకురావాలన్న అంశంపై ఎంపీడీఓతో కలిసి సమీక్షించారు. కోర్టులో కేసులు ఉన్న వెల్లంపల్లి సెంటర్పై తీసుకోవాల్సిన చర్యల గురించి ఆమె మాట్లాడారు. ప్రస్తుతం మరమ్మతుల్లో ఉన్న షెడ్లను వెంటనే ఎస్టిమేషన్స్ వేయించి గ్రామ పంచాయతీ నిధుల నుంచి లేదా మండల నిధుల నుంచి మరమ్మతులు చేయించాలని స్పెలాలాఫీసర్ ఆదేశాలు జారీ చేశారు. అవసరమైన చోట నాడప్ పిట్స్ను ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టాలని ఆమె స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. క్లాప్ మిత్ర జీతాలను పెండింగ్ లేకుండా వెంటనే చెల్లించాలని ఆమె ఆదేశించారు. సచివాలయాల్లో సర్వీస్లు పెంచాలని, సర్వీసుల నుంచి వసువులైన మొత్తాన్ని ఎప్పటికప్పుడు సంబంధిత ఖాతాకు జమ చేయాలని కోరారు. ఆమె వెంట ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఇన్చార్జి ఈఓపీఆర్డీ సుబ్బారావు పాల్గొన్నారు.

క్షయను నిర్మూలిద్దాం..


త్రోవగుంటలో సర్వే చేస్తున్న రమేష్బాబు


కరవది పీహెచ్సీలో ఏఎన్ఎంలు, ఆశాల సమావేశం

ఒంగోలు రూరల్: రూరల్లోని త్రోవగుంట అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో క్షయ వ్యాధి సర్వేను విజయవంతం చేయాలని డాక్టర్ రమేష్బాబు అన్నారు. హెచ్వీలు, ఏఎన్ఎంలు, ఆశా, సిబ్బంది సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సర్వేలో వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి ప్రభుత్వ ఆదేశాల మేరకు నివారణ మందులు అందజేయాలని కోరారు. హెచ్వీ రోహిణికుమారి మాట్లాడుతూ క్షయవ్యాధి లక్షణాలు సిబ్బందికి తెలియజేశారు. 15 రోజుల పాటు కొనసాగే ఈ సర్వేను అంకిత భావంతో నిర్వహించి విజవంతం చేయాలని కోరారు. త్రోవగుంట అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని సిబ్బంది క్షయవ్యాధి అధికారి, యూనిట్ సూపర్వైజర్ చంద్రమౌళి పలు సూచనలు చేశారు. రోహిణికుమారి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఆశా డే

సీజన్ మారుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వేగంగా ప్రబలే అవకాశం ఉందని, ఇందుకు ఆయా గ్రామ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఎస్.వాణి తెలిపారు. ఆశా డే సందర్భంగా ఆశా కార్యకర్తలకు హెచ్వీ అజితా నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో డాక్టర్ ఎస్.వాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైరల్ జ్వరాలు, జలుబు, సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు ఆన్లైన్ ద్వారా పీహెచ్సీకి సమాచారం అందిచాలన్నారు. అనంతరం మధ్యాహ్నం నుంచి రూరల్లోని ఏఎన్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది నెలవారి రిపోర్టుల జాబితాను ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందిన వారి జాబితా, ప్రసవించిన వారి జాబితాను 104 ద్వారా సేవలందిస్తున్న గ్రామాల్లోని రోగుల సంఖ్య ఫ్యామిలీల జాబితా తెలియజేశారు. కన్వీనర్గా హెచ్వీ అజితా, ఏఎన్ఎంలు, ఆశాలు, ఎస్ఎన్లు పాల్గొన్నారు.

పండగలా పింఛన్ల పంపిణీ

● సంతనూతలపాడులో 1207 మందికి రూ.2,750 చొప్పున పంపిణీ


పింఛన్లు అందజేస్తున్న ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి రూ.2,500 నుంచి రూ.2,750కు పెంచిన పింఛన్లను మంగళవారం సంతనూతపాడు మండల పరిషత్ కార్యాలయంలో పండగలా పింఛన్ల పంపిణీ నిర్వహించారు. పింఛన్ల పంపిణీ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు మేజర్ పంచాయతీ పరిధిలో మొత్తం 1,207 మందికి రూ.2,750 చొప్పున వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బి.విజయ, జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, స్థానిక సర్పంచ్ దర్శి నాగమణి చేతుల మీదుగా అందించారు. వారిలో 22 మందికి నూతనంగా పింఛన్లు మంజూరు చేశారు. గురవారెడ్డిపాలెంలో స్థానిక సర్పంచ్ మారెడ్డి విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కంచి మాధవీలత ఆధ్వర్యంలో దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ, జెడ్పీటీసీ చేతుల మీదుగా 241 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ, సచివాలయం సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చుతున్న జగన్

నాగులుప్పలపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నారని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. పెంచిన నూతన పింఛన్లు మంగళవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ముఖ్యమంత్రి చేవడుతున్న సంక్షేమ పథకాలతో వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. రాబోవు రోజుల్లో అందరం ఈ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగనన్నకు అండగా నిలవాలని కోరారు. అనంతరం గ్రామంలోని సీసీ రోడ్డుకు ఎంపీపీ శంకుస్థాపన చేశారు. మండల ప్రత్యేకాధికారి అంజలా, ఎంపీడీవో వేణుకుమారి, సర్పంచ్ శీలం రేణుక, సెక్రటరీ శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్లు డాకా అంజిరెడ్డి, శీలం సురేష్, పద్మ ఉన్నారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఈ నెల 5న ఒంగోలు పర్యటనకు వస్తున్నట్లు ఆయన కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు స్థానిక రాంనగర్లోని తన కార్యాలయంలో ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు అందుబాటులో ఉంటారన్నారు. ఉదయం 9.30 గంటలకు స్థానిక డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నిర్వహించే 25వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. 11 గంటలకు మార్కాపురం జార్జి ఇంజినీరింగ్ కాలేజీ క్యాంపస్లో జరిగే రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తల్లి సంస్మరణ సభలో పాల్గొంటారు. మిగిలిన సమయంలో ఒంగోలులోని తన కార్యాలయంలో అందుబాటులో ఉంటారు.

సీఎం వైఎస్ జగన్ను కలిసిన డాక్టర్ బత్తుల


సీఎంకు శుభలేఖ అందజేస్తున్న డాక్టర్ బత్తుల అశోక్కుమార్రెడ్డి

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ వైద్య విభాగం ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్కుమార్రెడ్డి తన రెండో కుమార్తె సాయి శివాని, రోహిత్ల వివాహానికి ఆహ్వానించేందుకు సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డిని తాడేపల్లిలోని నివాసంలో మంగళవారం ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో వెళ్లి కలిశారు. ఈనెల 27వ తేదీన నెల్లూరులో జరిగే వివాహ మహోత్సవానికి హాజరు కావాలని సీఎం వైఎస్ జగన్ను డాక్టర్ బత్తుల శుభలేఖ అందజేశారు. ఫిబ్రవరి మొదటి వారంలో సింగరాయకొండలో రిసెప్షన్కు హాజరవుతానని సీఎం తెలియజేశారని, అదే రోజు జాతీయ రహదారి పక్కన తాను నిర్మిస్తున్న వైఎస్సార్ ఆర్చిని కూడా సీఎం ప్రారంభిస్తారని వివరించారు.

క్రీడాకారునికి అండగా శివం ఫౌండేషన్


ఆర్థిక సాయం అందిస్తున్న శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి

ఒంగోలు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమైన యువ క్రీడాకారుడి కుటుంబానికి శివం ఫౌండేషన్ అండగా నిలిచింది. మంగళవారం స్థానిక ఇందిరా నగర్కు చెందిన టాక్సీ డ్రైవర్ మెడబలిమి వాసు, ఆయన కుమారుడైన కబడ్డీ క్రీడాకారుడు వంశీకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వంశీకృష్ణ తీవ్రంగా గాయపడి చెయ్యి, కాలు విరగడంతో పాటు మెదడుకు రక్తప్రసరణ చేసే రక్తనాళాలు దెబ్బతిని మంచానికే పరిమితమై అచేతనంగా నిలిచాడు. ఈ నేపథ్యంలో ఆ కుటుంబం ఆరు లక్షలకుపైగా అప్పులు చేసి వైద్య సేవలు పొందింది. ఈ నేపథ్యంలో తమ వంతు సాయంగా గొల్లపూడి హరికృష్ణ రూ.50 వేలు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఒంగోలు నగరాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెల్ల సుబ్బారావు మాట్లాడుతూ ప్రతినెలా వంశీకృష్ణ మందులకు సంబంధించి సాయం అందిస్తామని ప్రకటించారు. త్వరలోనే కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు ఇద్దరు పేర్కొన్నారు. చిక్కాల కిరణ్కుమార్, రామకృష్ణ హాజరయ్యారు.

క్విస్లో ముగిసిన స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ


శిక్షణ పూర్తి చేసుకున్న క్విస్ విద్యార్థులు

ఒంగోలు: రెండు వారాలుగా స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, అధ్యక్షుడు నిడమానూరి నాగేశ్వరరావులు మాట్లాడుతూ మైక్రోసాఫ్ట్ తదితర కంపెనీల్లో పనిచేస్తున్న సాఫ్ట్వేర్ ఇంజినీర్లు ప్రత్యక్షంగా రెండో సంవత్సర విద్యార్థులకు ఎంబెడెడ్ సిస్టం కంప్యూటర్ విషయం అండ్ మెషీన్ లెర్నింగ్ ఆటోమేషన్ అనే అంశంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సామర్థ్యాలు మరింతగా పెంచుకోవాలని సూచించారు. తద్వారా పారిశ్రామిక నైపుణ్యాలు మెరుగుపరుచుకునేందుకు అవకాశం లభిస్తుందన్నారు. క్విస్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు, విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ హిమబిందు, డాక్టర్ ఎం.లక్ష్మి పర్యవేక్షించారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

టంగుటూరు: సింగరాయకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అండర్–14 విభాగంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో టంగుటూరు బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ఎ.అశోక్, ఎస్.శ్రీను ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రాజారావు తెలిపారు. వీరు జనవరి 20, 21, 22 తేదీల్లో కర్నూలు జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పీఈటీ వెంకట్రావు, ఉపాధ్యాయులు జె.రంగస్వామి తదితరులు అభినందించారు.

లాభదాయకంగా పశుపోషణ

● పశుసంవర్ధ శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి


టంగుటూరు పశువైద్యశాలను తనిఖీ చేస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణి

సింగరాయకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న పాలవెల్లువ పథకం ద్వారా రైతులకు అధిక లాభాలు సమకూరుతున్నాయని పశుసంవర్ధ శాఖ జేడీ డాక్టర్ కె.బేబీరాణి పేర్కొన్నారు. మండలంలోని పాకల పశువైద్యశాలను, పాల వెల్లువ కేంద్రాలను మంగళవారం ఆమె పరిశీలించారు. డాక్టర్ బేబీరాణి మాట్లాడుతూ.. ప్రభుత్వం పశుపోషకులకు సబ్సిడీపై అందిస్తున్న టీఎంఆర్, చాఫ్ కట్టర్, గడ్డి విత్తనాలు, మినరల్ మిక్చర్ ఉపయోగించుకుని అధిక పాల దిగుబడి సాధించాలని సూచించారు. అనంతరం పశుపోషకులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు అందజేశారు. పశువైద్యాధికారి ఆర్.పేరయ్య, సర్పంచ్ బల్లెల ప్రభాకరరెడ్డి, ఎంపీటీసీ జి అశోక్కుమార్రెడ్డి, ఏపూరి శ్రీనివాసులు, కేశవరపు కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ చేయూతతో రైతులకు లబ్ధి

టంగుటూరు: వైఎస్సార్ చేయూత పథకం వల్ల ఎక్కువ మంది రైతులు లబ్ధి పొందేలా చూడాలని పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణి ఆదేశించారు. స్థానిక పశువైద్యశాలను జేడీ మంగళవారం తనిఖీ చేశారు. పశుపోషకులకు సబ్సిడిపై టీఎంఆర్, కిసాన్ క్రెడిట్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సుధీర్బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి గాయాలు

ఉలవపాడు: ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి పడిపోవడంతో వాహనం నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని జాతీయరహదారిపై కరేడు ర్యాంపు సమీపంలోని వేరు వెంకటేశ్వర స్వామి గుడి వద్ద జరిగింది. సింగరాయకొండ మండలం శానంపూడికి చెందిన తన్నీరు రాజు ఉలవపాడు నుంచి సింగరాయకొండ కు వెళ్తున్న సమయంలో అదుపు తప్పి పడిపోయింది. గాయపడిన వ్యక్తిని 108 సిబ్బంది ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన తన్నీరు రాజు